PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్


King Daily News Paper

ఒక దారి మూసుకుపోయినప్పుడు తప్పకుండా మరో దారి తెరిచి ఉంటుంది, దాన్ని గుర్తించగలగడమే విజయానికి మార్గం
– అలెగ్జాండర్ గ్రాహంబెల్

విజయవాడ, హైదరాబాద్ ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు సంపుటి : 01 సంచిక : 85 బుధవారం , జూలై 01 , 2026 , పేజీలు - 8 వెల : 3 /-

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

- ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ
- గనుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, జూన్ 30:**రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ పక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మిగతా2లో...

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

మనం అభివృద్ధి చెందడమే కాదు.. -వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి

గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**విశాఖపట్నం, జూన్ 30:**
దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.మిగతాది 2లో...

## జీతభత్యాల వివరాలు అందించండి..

- కేంద్ర శాఖలకు 8వ పే కమిషన్ డెడ్‌లైన్
- 8వ వేతన సంఘం ప్రక్రియలో కీలక ముందడుగు
- ఉద్యోగుల జీతభత్యాల వ్యయ వివరాలను కోరిన కమిషన్
- జూన్ 30 లోగా ఆన్‌లైన్‌లోనే డేటా సమర్పించాలని ఆదేశం
- గత మూడేళ్ల ఆర్థిక సంవత్సరాల పూర్తి వివరాలు తప్పనిసరి
- సిఫార్సుల రూపకల్పనలో ఈ సమాచారం అత్యంత కీలకం

**ముంబయి, జూన్ 30:**
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 8వ వేతన సంఘంతన కార్యకలాపాలను కీలక దశకు చేర్చింది. ఉద్యోగుల జీతాలు, అలవెన్సులపై సిఫార్సులు చేసేందుకు ముందుగా.. ప్రభుత్వం ప్రస్తుతం ఎంత ఖర్చు చేస్తోందో స్పష్టమైన అంచనాకు రావాలని కమిషన్ భావిస్తోంది. ఇందులో భాగంగా అన్ని మిగతాది 2లో...



## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ కల్యాణ్ భేటీ

తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ


రెండు ఆడపులులలను ఇచ్చేందుకు సిఎం అంగీకారం



**ముంబయి, జూన్ 30:**
మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు మిగతాది 2లో...

## కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

- అదే వేగంతో ముందున్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- రెండు వాహనాల మధ్య నుజ్జునుజ్జు అయిన కారు
- చిన్నారి సహా ఇద్దరు మృతి



**విజయవాడ, జూన్ 30:** కృష్ణా జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్,

మిగతా2లో...

## సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

**హైదరాబాద్, జూన్ 30:**
ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకు వస్తున్న సంస్కరణలను మిట్టల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతాది 2లో...



## దిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ




**హైదరాబాద్,జూన్ 30:**
కాంగ్రెస్ దిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. మిగతాది 2లో...

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్
- అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 30:**
ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్–2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణెళి కొత్త మిగతాది 2లో...



# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

చిరునామా' అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ÷టైర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు.

'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో




పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ÷ూష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య



సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

# జీతభత్యాల వివరాలు అందించండి..

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆన్‌లైన్ డేటా పోర్టల్‌లో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేయడానికి జూన్ 30 తుది గడువుగా నిర్ణయించినట్లు 8వ పే కమిషన్ అప్‌డేట్స్‌ను పంచుకునే ఒక పోర్టల్ పేర్కొంది. ఈ ప్రక్రియలో వందలాది ప్రభుత్వ కార్యాలయాలు, భారీ ఆర్థిక డేటా ఇమిడి ఉన్నందున, అన్ని సంస్థలు గడువులోగా ఈ పని పూర్తి చేస్తాయా? లేదా? కమిషన్ మరింత సమయం ఇస్తుందా అనేది వేచి సమాచారమంతా తప్పనిసరిగా తమ అధికారిక ఆన్‌లైన్ డేటా పోర్టల్ ద్వారానే సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఎలాంటి వివరాలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. అంటే.. మంత్రిత్వ శాఖలు భౌతిక ఫైళ్లు, ఎక్సెల్ షీట్లు, ప్రింటెడ్ డాక్యుమెంట్లు లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపడానికి వీల్లేదు. కేవలం ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన డేటాను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. సిఫార్సుల రూపకల్పన కోసం ఒకే డిజిటల్ డేటాబేస్‌ను రూపొందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

నివేదికల ప్రకారం.. గత మూడు పూర్తి ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వ్యయ వివరాలను అందించాలని కమిషన్ కోరింది. 2022-23, 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో ఉద్యోగుల జీతభత్యాలపై అయిన ఖర్చు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. పే మ్యాట్రిక్స్ లెవల్ 1 నుంచి లెవల్ 18 వరకు అన్ని స్థాయిలలో జీతాలు, వివిధ రకాల అలవెన్సులపై ఎంత ఖర్చు చేశారో విడివిడిగా చూపించాలి.

కేవలం మూల వేతనం ( మాత్రమే కాకుండా ప్రతి అంశానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను కమిషన్ కోరింది. ఇందులో బేసిక్ పే, మిలిటరీ సర్వీస్ పే, కరవు భత్యం (డీఏ), ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ), రవాణా భత్యం (టీపీటీఏ), రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, రైల్వే ఉద్యోగులకు రన్నింగ్ స్టాఫ్ అలవెన్సులు, నాన్-ప్రాక్టీసింగ్ అలవెన్స్ (ఎన్‌పీఏ) వంటి అన్ని వివరాలు ఉండాలి. వీటికి తోడు ఉద్యోగులకు చెల్లించే ఇతర అలవెన్సుల వివరాలను కూడా పొందుపరచాలి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో అలవెన్సులపై అయిన మొత్తం ఖర్చును కూడా నివేదించాల్సి ఉంటుంది.

వేతన సంఘం తన సిఫార్సుల రూపకల్పనకు ముందు చేపట్టే అతి ముఖ్యమైన చర్యలలో ఈ డేటా సేకరణ ఒకటి. ప్రస్తుతం వివిధ పే లెవల్స్‌లో జీతభత్యాలపై ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో అధ్యయనం చేయడం ద్వారా, భవిష్యత్తులో చేసే సవరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక ప్రభావాన్ని కమిషన్ కచ్చితంగా అంచనా వేయగలదు. సవరించిన పే స్కేల్స్, అలవెన్సులు, ప్రభుత్వ మొత్తం వ్యయం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై పటిష్టమైన సిఫార్సులు చేయడానికి ఈ సమాచారం దోహదపడుతుంది. ఈ డేటా సేకరణ పూర్తయ్యాక, కమిషన్ గణాంకాలను విశ్లేషించి, నివేదిక రూపకల్పనలో తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉంది.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్



(మొదటి పేజీ తరువాయి)

బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు పక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు పక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్టాల్లో్ల లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటా నియం, ఇల మనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు.

ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలి చ్చారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించా మని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించా రు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషిం చటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పా టు చేయా లన్నారు.

ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూ.ల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియో గం చేసు కునేలా చూడాలని అధికారులను సీఎం ఆదే శించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)



కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నాం.. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ మరియు ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచన చేశారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐకార్యకలాపాలపైన దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. ఎయిర్ టెల్ కు రెండో హెడ్ క్వార్టర్ లా హైదరాబాద్ ను చూస్తున్నామని మిట్టల్ అన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఆసక్తి చూపించిన సునీల్ మిట్టల్.

# మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ కల్యాణ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

# కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు.

ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

# ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా




**అమరావతి, జూన్ 30:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్సీ రివైజ్డ్ ఫలితాలు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏడాది మే 12 నుంచి 20 వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజా నిర్ణయం ప్రకారం జులై 2 వరకు ఈఏపీసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది.

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ



ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది.. దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు రాజ్యాంగం ఏం చెబుతోంది పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

### ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు




**న్యూఢిల్లీ,జూన్30:** తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు.

పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

### ● మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

**న్యూఢిల్లీ,జూన్30:** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10-15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

# భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

### - పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్

**న్యూఢిల్లీ,జూన్30:** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ఎ÷-లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.




# తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

### - పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

**కోల్‌కతా,జూన్30:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

కింగ్ డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper


# ప్రైవేటు స్థలం ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్పు



**విజయనగరం :** విజయనగరం రింగురోడ్డు సమీపంలోని తమ కుటుంబానికి చెందిన ప్రైవేటు స్థలాన్ని, వైఎస్సార్సీపీ హయాంలో ప్రభుత్వ స్థలంగా రికార్డులు మార్చి ఆ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఆరోపించారు. విజయనగరంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.ఫిర్యాదు చేసినా లాభం లేదు : గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు తన కుటుంబానికి చెందిన భూమిని అధికారిక రికార్డులలో ప్రభుత్వ భూమిగా మార్చి, ఆ తర్వాత వైఎస్సార్సీపీ హయాంలో ఆ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారని ఆరోపించారు. ఆ భూమి తమ వ్యక్తిగత ఆస్తి అని నిరూపించే రికార్డులన్నీ తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన ఒక రాజకీయ పార్టీకి దానిని ఎలా లీజుకు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఏడాది క్రితం నాటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, నాలుగు నెలల తర్వాత దానిపై ఆరా తీసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.విజయనగరం రింగ్ రోడ్డు సమీపంలో తమ కుటుంబానికి భూమి ఉందని, గత ప్రభుత్వ హయాంలో ఆ భూమికి సంబంధించిన రికార్డులను మార్చారని గజపతి రాజు ఆరోపించారు. ఆ భూమి విషయంలో తమ కుటుంబాన్ని ఎటువంటి విచారణ అడగకుండానే అధికారులు పై అధికారులను తప్పుదోవ పట్టించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను జిల్లా కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని పూర్తిగా వివరించానని ఆయన మీడియాకు తెలిపారు.' 'విజయనగరం రింగ్ రోడ్డు సమీపంలోని సర్వే నంబర్ 569లో మా కుటుంబానికి భూమి ఉంది. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, అక్టోబర్ 2021 నుంచి ఫిబ్రవరి 2022 మధ్య రికార్డులను మార్చారు. ఆ భూమిని 'వదిలివేసిన ఆస్తి' పేర్కొంటూ, మమ్మల్ని ఎవరూ సంప్రదించకుండానే అప్పటి అధికారులను తప్పుదోవ పట్టించారు. ఆ తర్వాత వైఎస్సార్సీపీ కార్యాలయ నిర్మాణానికి దానిని కేటాయించారు. మొదట రెండు ఎకరాలను శాశ్వతంగా, ఆపై ఒకటిన్నర ఎకరాన్ని లీజుకు, చివరగా మరో ఎకరాన్ని కేటాయించారు. ఈ ప్రక్రియ అంతా మండల స్థాయి అధికారి పర్యవేక్షణలో జరిగింది. నేను కలెక్టర్‌ను కలిసి జరిగిన పరిణా మాలను వివరించాను" – అశోక్? గజపతి రాజుఅధికారులను ప్రశ్నించిన గజపతి : వైఎస్సార్సీపీ పాలనలో తనపై అనేక అబద్ధపు కేసులు పెట్టడం, తన కుటుంబం ఎదుర్కొన్న వేధింపుల పట్ల అశోక్ గజపతి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై నమోదైన క్రిమినల్ కేసు కారణంగా మూడేళ్లపాటు కోర్టుకు పదేపదే హాజరు కావాల్సి వచ్చిందని ఆయన గుర్తుచే శారు. చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించి వైఎస్సా ర్సీపీ కార్యాలయాన్ని ఎలా నిర్మించారో వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గవర్నర్ కాకముందే తాను రాజకీయాల నుంచి తప్పుకున్నానని, అయినప్పటికీ ఇప్పుడు తన వ్యక్తిగత ఆస్తులను కూడా వదులుకోవాలని కొందరు సూచిస్తున్నారని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "నేను మీ ఇంటికి వచ్చి అది నా భూమి అని అంటే మీరు అంగీకరిస్తారా?" అని ఆయన అధికారులను ప్రశ్నించారు.

# విజయవాడలో ఘోర రోడ్డు ప్రమాదం.. నాలుగేళ్ల చిన్నారితో పాటు ఇద్దరి మృతి



**కృష్ణా జిల్లా, జూన్ 30:** జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో (మంగళవారం) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు.ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహా లు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివే గంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిం దని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలి స్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

# మామిడి రైతులు ఆందోళన పడొద్దు ఆదుకుంటాం



**అమరావతి, జూన్ 30:** మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు.రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షిం చమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా రైతులకు మేలు జరిగే నిర్ణయాలు



**కాకినాడ:** ఆక్వా రైతు బాగుంటేనే హేచరీలైనా ఇతర అను బంధ సంస్థలైనా బాగుపడతాయని వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తో ందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వంపై ఏడాదికి రూ. 1180 కోట్ల భారం పడినా రైతులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హేచ్ ఇండియా కాంపెండియం: కాకినాడలో ఆలిండియా ష్రింప్ హేచరీస్, ఆంధ్రప్రదేశ్ హేచరీస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆక్వారంగ వికాసం లక్ష్యంగా ప్రచురించిన హేచ్ ఇండియా కాంపెండియం పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలిండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ హేచరీస్ అసోషియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాథమిక రంగంలో కొనసాగుతున్న హేచరీలకు వ్యవసాయ, అనుబంధ రంగాలలాగే రాయితీలు ప్రోత్సాహకాలు కల్పించాలన్నారు. అక్వా రైతులకు రూపాయి న్నరకే అందిస్తున్న విద్యుత్ రాయితీని, హేచరీలకూ వర్తింపజేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.ప్రత్యేక రోడ్ మ్యాప్: ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే హేచరీల నిర్వాహకులు, ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్, ఎక్స్‌పోర్టర్స్, రైతులు ఈ నలుగురు బాగుండాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు అన్నారు. ఒకరిపై ఒకరు ఈర్ష పడకుండా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఆల్ ఇండియా అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రత్యేక రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో హేచరీ రంగానికి, ఆక్వా రైతులకు న్యాయం జరుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు, వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.'2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటర్నేషనల్? మార్కెట్?లో ముడి సరకు? ధర పెరగకపోయినా రూ.19.80 పైసలు పెంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై రూ. 4 తగ్గించాం. మళ్లీ ముడి సరకు ధర పెరిగితే రూ.4 పెంచాం. ఈ రోజు సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. కేజీకి రూ.35 పెంచకపోతే వాళ్లు ఇండస్ట్రీని నడపలేమన్నారు. దీనిపై ఓ కమిటీ వేశాం. ఇంటర్నేషనల్? మార్కెట్?లో రా మెటీరియల్ ధర తగ్గితే మళ్లీ ధర తగ్గిస్తాం.'

# ఏపీ విద్యా వ్యవస్థపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసలు



**విజయనగరం జిల్లా, జూన్ 30 :** విజయనగరం జిల్లా భోగాపురంలో పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ , ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ (మంగళవారం) సందర్శించారు. అనంతరం వారు భోగాపురం నుంచి విశాఖపట్నానికి బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా శాఖలో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి మంత్రి నారా లోకేశ్.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను లోకేశ్ వివరించారు.పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వారి ప్రతిభను అభినందించారు. విద్యా శాఖ మంత్రులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇవ్వడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, మౌలిక సదుపాయాలపై కూడా ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.అనంతరం మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. పాఠశాలల్లో వంటగదుల నిర్వహణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన విధానాన్ని అమలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తు న్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించేం దుకు అవసరమైన ప్రమాణాలను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. విద్యా రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని సంస్కరణలు తీసుకువచ్చి విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు.

# అశోక్ గజపతిరాజు స్థలం తిరిగి అప్పగించాలి.. అధికారులకు మంత్రి కొండపల్లి ఆదేశాలు



**విజయనగరం:** మాజీ కేంద్ర మంత్రి, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు చెందిన స్థలాన్ని తిరిగి ఆయనకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కొండపల్లి ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ స్థలాన్ని ఆక్రమించి పార్టీ కార్యాలయం నిర్మించడం అత్యంత దురదృష్టకరమని ఆయన విమర్శించారు.అశోక్ గజపతిరాజు నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్న మంత్రి, గత ప్రభుత్వంలో ఆయనపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, ఆయనకు చెందిన స్థలాన్ని కూడా కబ్జా చేసి వైసీపీ పార్టీ కార్యాలయాన్ని నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూసపాటి వంశీయుల ఆస్తులపై ఆ సంస్థానాధీశులకే పూర్తి హక్కులు ఉంటాయని, ఈ విషయం వైసీపీ నాయకులకు తెలియదా? అని ప్రశ్నించారు.రికార్డుల ప్రకారం సర్వే నంబర్లతో సహా అశోక్ గజపతిరాజు సమర్పించిన వివరాలను పరిశీలించి, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరం నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రైవేటు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా చూపించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఖాళీగా ఉన్న స్థలమని రికార్డులు తారుమారు చేసినా, అలాంటి భూమిని ప్రభుత్వ పరిరక్షణలో ఉంచాల్సింది పోయి ఒక రాజకీయ పార్టీ కార్యాలయానికి ఎలా అప్పగించారని మంత్రి ప్రశ్నించారు. కబ్జా చేశారని, ఇలాంటి వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

# ఐపీఎస్ సునీల్ కుమార్‌కు చుక్కెదురు.. పిటిషన్‌ను కొట్టివేసిన 'క్యాట్'



**అమరావతి, జూన్ 30:** తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు మరో సారి చుక్కెదురైంది. తనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన తుది పిటిషన్‌ను సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కొట్టివేసింది. (మంగళవారం) జరిగిన విచారణలో సునీల్ కుమార్ వాదనలు విన్న ట్రిబ్యునల్.. ఆయనకు ఎలాంటి ఊరట కల్పించేందుకు నిరాకరించింది. సస్పెన్షన్‌ను రద్దు చేయాలన్న అభ్యర్థనను ట్రిబ్యునల్ తోసిపుచ్చి ంది.తనపై విధించిన సస్పెన్షన్‌ను చట్టవిరు ద్ధంగా పరిగణించి, దానిని రద్దు చేయాలని కోరుతూ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను సునీల్ గతంలో ఆశ్రయించిన విషయం తెలిసిం దే. అధికారుల బదిలీలు, సస్పెన్షన్లు, క్రమశి క్షణా చర్యలపై క్యాట్ ఎప్పటికప్పుడు విచారణ జరిపి తగిన ఆదేశాలు ఇస్తుంది. క్యాట్ ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఇప్పటికే ఏపీ ప్రభుత్వం చెప్పింది. ఈ క్రమంలో సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలన్న అభ్యర్థనను క్యాట్ కొట్టివేయడంతో.. ఈరోజు పని వేళలు ముగిసిన తర్వాత ఆయన పదవీ విరమణను సస్పెన్షన్‌లోనే నోటిఫై చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# కొత్త ఆలోచనలకు, అవకాశాలకు సీఐఐ సదస్సు వేదిక కావాలి




**విశాఖ :** భాగస్వామ్య సదస్సు గతానికి భిన్నంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నవంబర్ 12, 13వ తేదీల్లో ఈ సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సారి ప్రాంతీయ స్థాయిలో కూడా సదస్సులు నిర్వహించాలని సూచించారు. కొత్త ఆలోచనలకు అవకాశాలకు సీఐఐ సదస్సు వేదిక కావాలన్న ఆయన ఎమ్ఓయూలు, పెట్టుబడు లతోపాటు నాలెడ్జ్ షేరింగ్ మీద ఎక్కువ దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు.వివిధ రాష్ట్రాల సీఎంలకు లేఖలు: నవంబర్‌లో నిర్వహించే 31వ సీఐఐ సదస్సుపై సీఎం చంద్రబాబు సమీక్ష చెయ్యనున్నారు. నేవిగేటింగ్ ఛేంజ్ లీడర్‌షిప్, టెక్నాలజీ, ట్రస్ట్ అండ్ ట్రేడ్ ఇన్ ఏ ట్రాన్స్‌ఫార్మింగ్ వరల్డ్ థీమ్‌తో 31వ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఎమ్ఓయూలు, మినిస్టీరియల్ సెషన్స్, ప్లీనరీ, కంట్రీ సెషన్స్, బీ2బీ, బీ2జీ సమావేశాలను రెండు రోజుల పాటు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ను ఆహ్వానించాలని సూచించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సీఎంలకు లేఖలు రాయాలని సూచించారు.జెన్ జీ భాగస్వామ్యం: దేశ విదేశాల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని జూలై నుంచి సెప్టెంబర్ వరకు రోడ్ షోలు చేపట్టాలని ఆదేశించారు. విశాఖ, రాజమహేంద్రవరం లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి నగరాల్లో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలన్నారు. ఇలా చేస్తే ప్రజలు, యువత, విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరుగుతుందన్నారు. కొత్త ఆలోచనలను ప్రజలకు చేరవేయడం, యువతలోని ఇన్నోవేషన్లను ఆయా రంగాల పారిశ్రామిక పెద్దల దృష్టికి వెళ్లడం అనేది సాధ్యమవుతుందని గుర్తుచేశారు. స్టార్టప్ కంపెనీలకు,ఇన్నోవేషన్లకు అగ్రభాగం ఉండాలన్నారు. జెన్ జీ భాగస్వామ్యం ఉండేలా చూడాలని సీఎం సూచించారు.కీలక అంశాల మీద చర్చ: భాగస్వామ్య సదస్సులు అంటే కేవలం పెట్టుబడులు రాబట్టడం,స్టార్టప్ కంపెనీలకు,ఇన్నోవేషన్లకు అగ్రభాగం ఎమ్ఓయూలు కుదుర్చుకోవడం అనే భావన పోవాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ కీలక అంశాల మీద చర్చ జరగాలన్నారు. నాలెడ్జ్ షేరింగ్ అనేది ముఖ్యమన్నారు. ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలపై చర్చించాలన్నారు. ప్రముఖ వర్సిటీలకు చెందిన నిపుణులను రప్పించాల న్నారు. గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను అమరావతిలో చేసుకోబోతున్నామన్నారు.

# కొత్త సీఎస్ వచ్చేశారు బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు



**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శిగా సం జయ్ జాజు బాధ్యతలు స్వీకరించారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టే ముందు సంజయ్ జాజు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి రామకృష్ణారావుతో కలిసి నేరుగా సచివాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఎస్‌కు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, వివిధ శాఖల అధికారులు శుభాకాం క్షలు తెలిపారు.మధ్యప్రదేశ్‌కు చెందిన తెలంగా ణ కేడర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు, 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నా రు. సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్ర సర్వీసుల్లో కీలక బాధ్యతల్లో పని చేశారు. క్షేత్రస్థాయి పోస్టులు మరోవైపు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాలనాపరమైన ఉన్నత హోదాల్లో చేసిన అనుభవం ఉంది. ముఖ్యంగా ఈ గవర్నెన్స్, పరిపాలనలో డిజిటల్ వినియోగంపై సంజయ్ జాజుకు పట్టు ఉంది.'మీ సేవ'ను తేవడంలో కీలక పాత్ర : మెకానికల్ ఇంజినీరిం గ్‌లో ఎంటెక్, ఎంబీఏ ఫైనాన్స్ చదివిన సంజయ్ జాజు ఏపీలోని విజయవాడ సబ్ కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, హైదరాబాద్, విశాఖపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ల కమిషనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, ఈ గవర్నెన్స్ కార్యదర్శిగా ఉన్నప్పుడు మీ సేవ ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంలో సంజయ్ జాజు కీలక పాత్ర పోషించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు, 2014 నుంచి 2018 వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలోనే ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ పూర్తి డిజిటల్ వ్యవస్థగా మారి జాతీయ ఈ గవర్నెన్స్ గోల్డ్ అవార్డు అందుకుంది. ఆ తర్వాత ఐదేళ్లు రక్షణ శాఖలో జాయింట్ సెక్రటరీ, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. యూనియన్ సెక్రటరీగా పదోన్నతి పొందిన తర్వాత రెండేళ్ల పాటు సమాచార, ప్రసార శాఖకు నేతృత్వం వహించారు.అదనపు బాధ్యతలు : రెండు సంవత్సరాల నుంచి ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ జాజు, ఇటీవలే తెలంగాణకు కేడర్‌కు తిరిగి వచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్‌గా కూడా కొనసాగనున్నారు. కీలకమైన ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు సీఎంవోలో ఏర్పాటు చేసిన స్పీడ్ విభాగం సీఈవోగా అదనపు బాధ్యతలూ నిర్వహిస్తారు. సీఎంవోలోని ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ప్రత్యేక సీఎస్‌గా కూడా సంజయ్ జాజు వ్యవహరిస్తారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30:** జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లు గప్పేందుకు లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు లారీని సోదా చేసి, దాదాపు 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన ఈ గంజాయి విలువ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్‌లో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న లారీతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## విద్యార్థులకు ఊరట.. ఫీజువసూళ్లపై హైకోర్టు స్టే కొనసాగింపు




**హైదరాబాద్, జూన్ 30 :** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది.దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది.

# సరూర్‌నగర్‌లో భారీ బ్లాస్ట్ ధ్వంసమైన ఇంటి గోడలు



**హైదరాబాద్ :** సరూర్‌నగర్‌లో భారీ పేలుడు సంభవించింది. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించగా, ప్రమాద తీవ్రతకు ఇల్లు ధ్వంసమైంది. ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు అద్దాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.సంఘటన అనంతరం ఇంట్లోని గ్యాస్ స్టౌ, 3 గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించగా, అవన్నీ సురక్షితంగా ఉండటం మరింత మిస్టరీగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళ్లు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.కారణాల అన్వేషణలో అధికారులు : సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్? రోడ్ నెంబర్ 4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి గత 24 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. అతని ఇంట్లోని కిచెన్‌లో ఈ ఘటన జరిగింది. నిపుణుల సహాయంతో ఇంటి ధ్వంసానికి గల అసలు కారణాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఈ ఘటన, ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని భారీ శబ్ధానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. నేను అప్పటి వరకు ఇంటి బయట ఉన్నాను. అప్పుడే వచ్చి సోఫాలో కూర్చున్నాను. అంతలోనే కిచెన్?లో పెద్ద శబ్ధంతో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. వెళ్లి చూసేసరికి గోడలు ధ్వంసమయ్యాయి. కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. కిచెన్‌లో మేం ప్రస్తుతం వాడుతున్న సిలిండర్‌తో పాటు మరో 2 నిండు సిలిండర్లు ఉండగా, అవి బాగానే ఉన్నాయి. పేలుడుకు సంబంధించి కారణం ఏంటో మాత్రం తెలియడం లేదు. - ఇంటి యజమాని ప్రమాద ఘటనపై ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య స్పందించారు. వంట గదిలో గ్యాస్ లీక్ కావడం వల్లే పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అయితే ఘటనకు గల కచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు పోలీసులు,సంబంధిత అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ స్పష్టం చేశారు.ప్రాథమిక సమాచారం ప్రకారం కిచెన్‌లో గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఘటనకు గల కచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నాం. పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తాం.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఏబీవీపీ నిరసన ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత




**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ఏబీవీపీ ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ శ్రేణులు నినాదాలు చేస్తూ ఉన్నత విద్యామండలి కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఏబీవీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. విద్యార్థి సంఘం నేతలను అదుపులోకి తీసుకున్నారు.రాష్ట్రంలోని ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలనే ఆలోచనను సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే మానుకోవాలని హెచ్చరించారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. విద్యార్థులతో కలిసి ఆర్. కృష్ణయ్య నిరసనలో పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకోని నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. బకాయిలు తక్షణమే చెల్లించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. మన పక్క రాష్ట్రాల్లో లేని ఇబ్బంది అత్యంత ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరారు.' 'రాష్ట్రంలో పెద్ద ఎత్తు కాలేజీలను బహిష్కరించడం చరిత్రలో ఇది మొదటిసారి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం గత 18 ఏళ్ల నుంచి నడుస్తుంది. ఎంతో మంది ఉన్నత చదువులను చదివారు. లక్షల కుటుంబాలు ఈ స్కీం వల్ల బాగుపడ్డాయి. పక్క రాష్ట్రమైన ఏపీలో లేని ఇబ్బంది మన ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఎందుకు ఉంది" - ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడుతక్షణమే బకాయి ఎలను విడుదల చేయాలి : తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే మానుకోవాల ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపేటలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు. కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు."పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో తక్షణమే స్పందించి రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి. కార్పొరేట్ కాలేజీలు విద్యార్థుల దగ్గర ఫీజులను భారీగా వసూలు చేస్తున్నాయి. వందల కోట్లు కాదు, పెండింగ్‌లో వేల కోట్లు ఉన్నాయి. వాటన్నింటినీ తక్షణమే విడుదల చేయాలి. ఏబీవీపీ నిరసన ఇది కేవలం ప్రారంభం మాత్రమే" -ఏబీవీపీ విద్యార్థులు

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు భారీ ఊరట.. ఆ కేసులో నిర్దోషిగా ప్రకటించిన కోర్టు



**హైదరాబాద్, జూన్ 30:** 2022 నాటి వివాదాస్పద వ్యాఖ్యల కేసులో గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్‌కు భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును హైదరాబాద్ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను నిశితంగా పరిశీలించిన కోర్టు.. రాజాసింగ్‌పై మోపిన ఆరోపణలు ఏవీ సరైనవి కావని నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తుది తీర్పును వెలువరించింది. 2022, ఆగస్టు నెలలో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. మునావర్ షోను నిరసిస్తూ యూట్యూబ్ ద్వారా ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియో దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలోనే రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొడుతునా ్నరంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందాయి. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయనపై ఐపీసీ సెక్షన్లు 153295ూ , 504, 505(2), 506 కింద కేసులు నమోదయ్యాయి.2022 ఆగస్టు 23వ తేదీన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే, అరెస్ట్ ప్రక్రియలో పోలీసులు సరైన నిబంధనలు పాటించ లేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించింది. ఆయనను వెంటనే విడుదల చేసింది. రాజాసింగ్ విడుదల తర్వాత నగరంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే కారణంతో, అప్పటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు 2022, ఆగస్టు 25వ తేదీన మంగళ్‌హాట్ పోలీసులు రాజా సింగ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. దీంతో రాజాసింగ్ 77 రోజుల పాటు జైలులో ఉన్నారు.

## రాజేశ్ లాకప్ డెత్ కేసులో తెలంగాణ పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్




**హైదరాబాద్, జూన్ 30 :** తెలంగాణ పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. రాష్ట్రంలో సంచలనం రేపిన రాజేశ్ లాకప్ డెత్ కేసులో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను మూడు వారాల్లో సమర్పించాలని సూర్యాపేట జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారులను ఆదేశించింది. రాజేశ్‌ను కోదాడ పోలీసులు ఐదు రోజుల పాటు అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో చిత్రహింసలకు గురిచేశారని న్యాయవాది రామారావు ఇమ్మినేని ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించిన కమిషన్ ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని వివరణ కోరింది.బాధిత కుటుంబ సభ్యులు ఈ ఘటనను కస్టడీ హత్యగా పరిగణిం చాలని, బాధ్యులపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సమర్పించాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. ప్రత్యేకంగా పోస్ట్‌మార్టం వీడియో, పోస్ట్‌మార్టం నివేదిక, మేజిస్ట్రియల్ విచారణ వివరాలు, వైద్యపత్రాలు, కేసు దర్యాప్తునకు సంబంధించిన అన్ని రికార్డులను కమిషన్ ముందు ఉంచాలని సూచించింది. అలాగే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది.

# సాదాబైనామా భూముల సమస్యకు చెక్ అర్హులైన వారికి పట్టాదారు హక్కులు




**హైదరాబాద్:** తెలంగాణలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. 9.25 లక్షల దరఖాస్తులను పరిశీలించి 6 లక్షలకు పైగా నోటీసులను రెవెన్యూ శాఖ జారీ చేసింది. నిర్ణీత గడువులోగా విచారణలు పూర్తి చేసి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందజేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెల్ల కాగితాలపై భూముల క్రయవిక్రయాలు : తెలంగాణలో సాదాబైనామా భూముల సమస్య దశాబ్దాలుగా రైతులను వెంటాడుతోంది. అధికారిక రిజిస్ట్రేషన్ లేకుండా తెల్ల కాగితాలపై జరిగిన భూముల క్రయవిక్రయాలు అధికారిక రికార్డుల్లో నమోదు కాకపోవడంతో లక్షలాది మంది రైతులు తమ భూములపై చట్టబద్ధమైన హక్కులు పొందలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 9.25 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వారు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంట బీమా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. పరిశీల నకు ప్రత్యేక నిబంధనలు : 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం దరఖాస్తులను స్వీకరించింది. అయితే న్యాయపరమైన వివాదాలు, చట్టపరమైన అడ్డంకులు ఎదురుకావడంతో సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఏ మాత్రం ముందుకు సాగలేదు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక నిబంధనలు రూపొందించింది.6 లక్షల మందికి నోటీసులు : సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన వారిలో అర్హత కలిగిన చిన్న, సన్నకారు రైతుల కు ఆ భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పిం చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.25 లక్షల సాదాబైనా మా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తం గా సుమారు 6 లక్షల మందికి నోటీసులు జారీ చేయగా మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన వారికి పట్టా పాస్‌బుక్‌లు : సాదాబైనామా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అర్హత ఉన్న దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో గ్రామస్థాయిలో విచారణలు నిర్వహించి సంబంధిత భూములపై అభ్యంత రాలను స్వీకరించి, నిశితంగా పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి సెక్షన్ 13(బీ) ప్రక్రియ ద్వారా సంబంధిత భూములపై పట్టాదార్ హక్కులు కల్పిస్తారు. 3 లక్షల మందికి పైగా పట్టాలు జారీ : భూభారతి అమలులో భాగంగా సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ప్రభుత్వం దానిని దశల వారీగా అన్ని జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించింది. భూమి సర్వే, స్టాంపులు-రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులను ఒకే వ్యవస్థలో వివాదాలు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 3.65 లక్షలకుపైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

# సర్ ప్రక్రియ, ఈసీ పాత్రపై విపక్షాల అభ్యంతరం- సీజేఐకు 23 పార్టీలు సంయుక్త లేఖ

**న్యూ ఢిల్లీ :** దేశంలో ఎన్నికల ప్రక్రియ, సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. సర్ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఇండియా కూటమి లేఖ రాసింది. ఈ లేఖకు మొత్తం ఒక స్వతంత్ర ఎంపీతో పాటు 23 రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. లేఖ రాసిన విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'స్యూర్' నినాదంతో ముందుకు'జూన్ 8న జరిగిన ఇండియా జనబంధన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. ఈ సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర సభ్యుడు హాజరయ్యారని తెలిపారు. ప్రస్తుతం మరో రెండు పార్టీలు మద్దతు తెలపడంతో మొత్తం 23 పార్టీలు ఈ లేఖపై సంతకం చేశాయని పేర్కొన్నారు. విపక్ష పార్టీల ఐక్యతకు 'స్యూర్' అనే నినాదాన్ని ప్రస్తావించారు. ఇందులో 'సాలిడారిటీ', 'యూనిటీ', 'రెసిస్టెన్స్' అనే మూడు అంశాలు ప్రధానంగా



ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత కోసం కలిసి పోరాడతామని స్పష్టం చేశారు.డీఎంకే, ఆప్ మద్దతుఇండియా కూటమి తరఫున ఇది మంచి ముందడుగని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఎంపీ డెరిక్ ఓ బ్రియన్ అన్నారు. ఈ లేఖకు ఆప్, డీఎంకే మద్దతు తెలిపినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఈ లేఖపై స్వతంత్ర రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబిల్ కూడా సంతకం చేశారు.ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలుప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధృవీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే విమర్శలఇండియా జనబంధన్ సమావే శంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిం చారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థలు ఒత్తిడికి గురవుతున్నా యని, రాజ్యాంగంపై నిరంతర దాడులు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని, కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థుల పై ఒత్తిడి తీసుకురావడా నికి ఉపయోగిస్తున్నారని విమర్శించారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష కొనసాగుతోందని కూడా ఆరోపించారు.ఆర్థిక, సామాజిక అంశాల ప్రస్తావనదేశంలో ద్రవ్యోల్బ ణం పెరుగుతుండటం, నిరుద్యోగ సమస్య తీవ్రమవడం, కొత్త పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి అంశాలను కూడా ఖర్గే ప్రస్తావించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, పరీక్షల నిర్వహణలో లోపాల కారణంగా యువత ఆశలు దెబ్బతింటున్నాయని అన్నారు. అలాగే బలహీన వర్గాలపై దాడులు కొనసాగుతున్నాయని, విదేశాంగ విధానంలో కూడా సంప్రదాయ విలువలు దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు.మొదట ఇండియా కూటమి సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినప్పటికీ, అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వస్తాయా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ తర్వాత ఆప్, డీఎంకే కూడా సంయుక్త లేఖకు మద్దతు తెలిపాయి. దీంతో ఎన్నికల వ్య వస్థకు సంబంధించిన అంశాల్లో విపక్షాలు మరో సారి ఏకతాటిపైకి వచ్చాయనే సంకేతాలు కనిపి స్తున్నాయి. ఇక ఈ లేఖపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఎలాంటి స్పందన వ్యక్తం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# ఇథనాల్ కేటాయింపుల వివాదం.



**న్యూఢిల్లీ, జూన్ 30:** 2025-26 సరఫరా సంవత్సరానికి సంబంధించి ఇథనాల్ కేటాయింపుల విషయంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. బీపీసీఎల్ తరఫున కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి వాదనలు వినిపించారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపే అద్భుతమైన ప్రక్రియ ఫలితాలు వచ్చే ఏడాదికి స్పష్టంగా తెలుస్తాయని కోర్టుకు తెలిపారు.దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ.. పిటిషనర్లు మొదట కర్ణాటక హైకోర్టుకు చెందిన డివిజన్ బెంచ్‌ను ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించింది. దీనికి వెంకటరమణి సమాధానం ఇస్తూ.. అక్టోబర్ 2025 నాటికే ఇథనాల్ సరఫరా ఒప్పందాలన్నీ ముగిసిపోయాయని సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇప్పుడు మళ్లీ ఈ ప్రక్రియను మొదటికి తెస్తే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని అన్నారు.దేశవ్యాప్తంగా ఇలాంటి వివాదాలు పలు రాష్ట్రాల హైకోర్టుల్లో నడుస్తున్నాయని, దీనివల్ల వేర్వేరు కోర్టులు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ కేసులన్నింటినీ ఒకే చోటికి బదిలీ చేయాలని కోరారు. అటార్నీ జనరల్ విజ్ఞప్తిని ప్రైవేట్ కంపెనీల తరఫు న్యాయవాది సిద్ధార్థ్ దేవ్ వ్యతిరేకించారు. ఇదంతా కేసు విచారణను ఆలస్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నమని కోర్టుకు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు స్టేటస్ కో అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

# టీఎంసీకి షాక్.. ఆ కేసుపై అత్యవసర విచారణకు కోల్‌కతా హైకోర్టు నిరాకరణ



**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేం దుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ ప్రక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతు ందని స్పష్టం చేశారుకేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడం తో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశా లను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టు ను ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# రామమందిర విరాళాల కేసుపై మోదీ మౌనం కోట్లాది భక్తుల విశ్వాసంపై దాడి చేసినట్టే

**అయోధ్య:**అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియో గం కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మా రిన వేళ, ప్రధాని నరేంద్ర మోదీ మౌనంపై కాం గ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ వ్యవహారంపై ప్రధాని స్పందించకపోవడం కోట్లాది మంది భక్తుల విశ్వాసంపై నేరుగా దాడి చేసినట్టేనని పేర్కొంది. ఈ అంశంపై పారదర్శక దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.రామాలయ నిర్మాణం, శ్రీరాముడి పేరును రాజకీయంగా వినియోగిం చుకున్న బీజేపీ ఇప్పుడు విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై ఎందుకు మాట్లాడటం లేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పారదర్శక ప్రమాణాలు లేకుండా ఏర్పాటు చేసిందని, ఆ ట్రస్ట్‌లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులను నియమించిందని ఆరోపించారు. అనంతరం ఆ ట్రస్ట్‌ను సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధి నుంచి మినహాయించడం అనుమానాలకు తావిచ్చిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఇప్పటికైనా మౌనం వీడాలని



అన్నారు.అయోధ్యలో అజయ్‌రాయ్ అదుపులోకిఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ ప్రతినిధి బృందం మంగళవారం అయోధ్యకు వెళ్లి శ్రీరాముడి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందాల్సి ఉండగా, యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్? రాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయోధ్య చేరుకున్న కొద్దిసేపటికే భయంతో వణికిపోతున్న బీజేపీ ప్రభుత్వం పోలీసులు పంపించి తనను హోటల్ నుంచి అదుపులోకి తీసుకుందని అజయ్ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం భయంతో వ్యవహరిస్తోందని, ప్రతిపక్ష నాయకులను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని ఆయన విమర్శించారు. తమ ప్రతినిధుల బృందం శాంతియుతంగా ప్రార్థనలు చేసేందు కు మాత్రమే వెళ్లిందని, అయినప్పటికీ పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. బీజేపీ పై విపక్షాల దాడిఇక రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున ఈ కేసుపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌ను రద్దు చేయాలని కూడా కోరింది. మరోవైపు ఈ వ్యవహారంలో బీజేపీపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. శ్రీరాముడిని మోసం చేసిన పార్టీకి నిజమైన సనాతనులు మద్దతు ఇవ్వకూడదని, ఆ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయవద్దని ఆయన పిలుపునిచ్చారు. నిందితులకు కఠిన శిక్ష తప్పదు: బీజేపీఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ స్పష్టం చేసింది. హిందూ సమాజం నుంచి కూడా వారికి సామాజిక బహిష్కరణ ఎదురవుతోందని పేర్కొంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే దోషులకు ఆదర్శప్రాయమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారని పార్టీ తెలిపింది.ఇదిలా ఉండగా, అయోధ్యలోని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ కూడా ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు తమ సభ్యులు ఎవరూ న్యాయ సహాయం అందించబోరని ప్రకటించింది. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపింది. ఇక రామాలయ విరాళాల అక్రమాలపై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ శీల్ నాగు ధర్మాసనం వేసవి సెలవుల అనంతరం కేసును విచారణకు తీసుకుంటామని తెలిపింది. జూలై 13న సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభం కానుండడంతో ఆ తర్వాత ఈ కేసుపై విచారణ జరగనుంది.విరాళాల దుర్వినియోగ ఆరోపణలు రావడంతో జూన్ 13న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ నివేదిక ఆధారంగా అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ టిన్నూ యాదవ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

# భవిష్యత్తులో యుద్ధాలు మరింత సమగ్రంగా, వ్యూహాత్మకంగా ఉంటాయ్

**ఢిల్లీ:**భవిష్యత్తులో యుద్ధాలు గురించి భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో యుద్ధాలు మరింత సం యుక్తంగా, సమగ్రంగా, వ్యూహాత్మకంగా ఉం టాయని అభిప్రాయపడ్డారు. అందువల్లసాయుధ దళాల దిశ స్పష్టంగా ఉందన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాలు ఒకే దృక్పథంతో కలిసి ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం, చర్యలు చేపట్టాలని సూచించారు. 40 ఏళ్లకు పైగా సైనిక రంగంలో పనిచేసిన ఉపేంద్ర ద్వివేది మంగళవారం రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని సౌత్ బ్లాక్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'40 ఏళ్లు సైన్యంలో సేవ చేసే భాగ్యం దక్కడం నా అదృష్టం' నేను ఆర్మీ చీఫ్‌గా నా పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్నాను. అందుకు నాకు గర్వంగా ఉంది. సైనిక్ స్కూల్ నుంచి ఆర్మీ చీఫ్ వరకు నా ప్రయాణం అద్భుతంగా సాగింది. నాలుగు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవ చేయడం నాకు లభించిన గొప్ప అదృష్టం. భారత సైన్యానికి బలం ఒక్క వ్యక్తి నుంచి రాదు. సైనికులు, కమాండర్లు, వారి కుటుంబాలు, దేశ పౌరుల అచంచలమైన విశ్వాసం నుంచి వస్తుంది. దేశ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ప్రతి సైనికుడికి జోహార్లు.



ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాలు మధ్య సమన్వయం బలపడింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉమ్మడి ఆలోచనతో, సమగ్రతతో కలిసి పనిచేశాయి. భవిష్యత్తులో యుద్ధాలు మరింత సమగ్రంగా, త్రివిధ దళాలు కలిసికట్టుగా పోరాడేలా ఉంటాయి."--జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆర్మీ చీఫ్ఆపరేషన్ సింధూర్‌లో త్రివిధ దళాలు సమైక్యంగా పనిచేశాయ్ : ఆర్మీ చీఫ్గత రెండేళ్లుగా భారత సైన్యం అన్ని రంగాల్లో తన కార్యాచరణ సంసిద్ధతను ప్రగతిశీల పద్ధతిలో కొనసాగించిందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వ్యాఖ్యానించారు. 'ఆపరేషన్ స్నో లెపార్డ్' కింద ఉత్తర సరిహద్దులో ఆర్మీ బలగాల మోహరింపు పటిష్ఠంగా, అప్రమత్తంగా ఉందన్నారు. పశ్చిమ సరిహద్దులో కూడా ఇండియన్ ఆర్మీ పూర్తి ధైర్యంతో, సంసిద్ధతతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించిందని గుర్తు చేశారు. అందుకు ఆపరేషన్ సిందూర్ ఒక సజీవ సాక్ష్యమని కొనియాడారు. జాతీయ భద్రత విషయంలో ఆర్మీ అత్యంత క్రమశిక్షణతో, బాధ్యతాయు తంగా వ్యవహరించి కొత్త సాధారణ స్థితిని (న్యూ నార్మల్) నెలకొల్పిందని ప్రశంసించారు. 2025 మేలో పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాల్లోని మూడు విభాగాలూ (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) సమన్వయంతో సమైక్యంగా పనిచేశాయని అన్నారు.దేశ సైనికులపై ప్రశంసలుభారత సైనికులు దేశ రక్షణ కోసం పర్వతాలు, ఎడారులు, హిమానీనదాలు, అడవులు, దుర్భేద్యమైన సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తారని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ప్రశంసించారు. ఏ కమాండర్‌కైనా అతని బలం సైనికులేనని వివరించారు. సైనికుల నిబద్ధత, ధైర్యం, క్రమశిక్షణే ఇండియన్ ఆర్మీకి ప్రధాన గుర్తింపు అని అభిప్రాయపడ్డారు. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లో ఆర్మీలోని ధైర్యవంతులైన సైనికులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐక్యరాజ్యసమితి దళాల్లో మోహరించడం నుంచి మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లో పాల్గొనడం వరకు, కాంగోలోని దట్టమైన అడవులైనా, భూకంపం సంభవించిన వెనిజువెలా భూభాగమైనా భారత సైనికులు దేశ పతాకాన్ని గౌరవంగా ఎగురవేస్తూనే ఉన్నారని అన్నారు.ఉపేంద్ర ద్వివేది రిటైర్2024 జూన్ 30న భారత ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్‌ఫోర్స్) సమన్వయంతో సమైక్యంగా సరిగ్గా రెండేళ్లపాటు దేశ సైన్యాధ్యక్షుడిగా సేవలందించారు. అనంతరం 2026 జూన్ 30న ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది పదవీ కాలం ముగియడంతో రిటైర్ అయ్యారు. ఆ యన స్థానంలో తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను బాధ్యతలు చేపట్టను న్నారు. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఖడక్‌వాస్లా (మహారాష్ట్ర) పూర్వ విద్యార్థి. ఆయన 1986లో ఆర్మీలో చేరారు. నాలుగు దశాబ్దాల సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేశారు. జమ్ముకశ్మీర్‌లో వివిధ విభాగాలకు నేతృత్వం వహించిన ఆయన మంచి పేరు సంపాదించుకున్నారు.

# ఉత్తర్‌ప్రదేశ్ మధుర జిల్లాలో రోడ్డుప్రమాదం, నలుగురి మృతి.

**ఉత్తర్‌ప్రదేశ్:** మధుర జిల్లాలో (మంగళవారం) తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రాయా పోలీస్ స్టేషన్ పరిధిలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ ట్రక్కును బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు ప్రయాణికులు మృతిచెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 65 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు అతి వేగమే ఈ ఘోరానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందిన వెంటనే రాయా స్టేషన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, అగ్నిమాపక సిబ్బందీ చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను వెంటనే రక్షించి అంబులెన్స్‌లో మధుర జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై మధుర ఎస్పీ (గ్రామీణ) సురేశ్ చంద్ర రావత్ స్పందించారు. యమునా ఎక్స్‌ప్రెస్‌వే మూడో లేన్‌లో




ప్రయాణిస్తున్న ట్రక్కును బస్సు అతి వేగంతో ఢీకొట్టిందని ఆయన తెలిపారు.తెల్లవారుజామున 4 గంటలకు తమకు సమాచారం అందిందని ఎస్పీ రావత్ పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించామన్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని తెలిపారు. బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా అధికారులు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేశారని వెల్లడించారు. జిల్లా యంత్రాంగం మొత్తం సంఘటనా స్థలంలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. మరో 35 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని ఎస్పీ రావత్ వెల్లడించారు. ఈ ప్రమాదంతో ఎక్స్‌ప్రెస్‌వేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.

**కశ్మీర్ :**అమర్‌నాథ్ యాత్ర ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జూలై 3న ప్రారంభం కానున్న ఈ అమర్‌నాథ్ యాత్రకు భద్రతను మరింత పటిష్టం చేసింది. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు తెలిపాయి.ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని, జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేథ ఆధారిత కెమెరాలు, యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

# దేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, జాతీయ భద్రతే మూలస్తంభాలు

**గుజరాత్:** బలమైన ఆర్థిక వ్యవస్థ, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం, పటిష్ఠమైన జాతీయ భద్రత ఈ మూ డూ ఒక గొప్ప దేశానికి మూలస్తంభాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక గత రెండు దశాబ్దాల్లో గుజరాత్ అభివృద్ధికే కాకుండా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంగా మారిందని



పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను కూడా తాను సందర్శించినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), గిరిజన ఉత్పత్తులు, భారీ పరిశ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన అనేక విభాగాలు ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమలో జరుగుతు న్న పనులు ప్రశంసనీయమని చెప్పారు. దేశంలో ప్రైవేటు పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయప డ్డారు.మోదీ కూడా ఈ నేల నుంచే!గుజరాత్ దేశానికి ఎన్నో గొప్ప నాయకులను అందించిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహానుభావులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ నేల నుంచే ఎదిగారని చెప్పారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ మరింత పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ వేదికల్లో భారత్ మాట్లాడితే ప్రపంచ దేశాలు ఆసక్తిగా వినే పరిస్థితి ఏర్పడిందని, దీనికి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు.

# బెంగళూరుకు మకాం మార్చిన పాండ్య




టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన క్రికెట్ కెరీర్‌ను మరింత కాలం పొడిగించుకునేందుకు బెంగళూరుకు మకాం మార్చాడు. తన రోజువారీ ప్రాక్టీస్‌తో పాటు ఫిట్‌నెస్ మెరుగుపర్చుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇక నుంచి పూర్తి కాలం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో గడపనున్నాడు. జాతీయ జట్టు, ఐపీఎల్‌కు ఆడని సమయంలో బీసీసీఐ సీఓఈలో ట్రైనింగ్ తీసుకోనున్నాడు. సాధారణంగా క్రికెటర్లు గాయాలపాలైనప్పుడు మాత్రమే ఇక్కడికి వస్తుంటారు. కానీ, హార్దిక్ ఈ కేంద్రాన్ని తన సొంత హోమ్ బేస్‌గా మార్చుకున్నాడు. ఇలా చేసిన తొలి భారత సీనియర్ క్రికెటర్‌గా నిలిచాడు. బరోడాకు చెందిన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం ముంబైలోని లోయర్ పరేల్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. అక్కడ ట్రైనింగ్ కోసం ముంబై ఇండియన్స్ హై-పర్‌ఫార్మెన్స్ సెంటర్‌కు వెళ్తున్నాడు. అయితే విపరీతమైన ట్రాఫిక్ వల్ల రోజూ గంటల కొద్దీ ప్రయాణించాల్సి వస్తోంది. ఈ ప్రయాణ అలసట నుంచి విముక్తి పొందేందుకు.. అలాగే మెరుగైన ట్రైనింగ్ కోసం హార్దిక్ పాండ్యా బెంగళూరుకు మాకాం మార్చాడు. బెంగళూరు శివార్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సమీపంలోనే ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. రాబోయే ఐదారేళ్ల పాటు భారత్ తరఫున వైట్‌బాల్ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడవమే లక్ష్యంగా హార్దిక్ సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా తొడకండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ గాయంతోనే అతను అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌తో పాటు ఇంగ్లండ్ పర్యటనకు దూరమయ్యాడు. గత 6 నెలల్లో ఎక్కువ భాగం బెంగళూరులో సీఓఈలోనే గడిపిన హార్దిక్ పాండ్యా.. త్వరలోనే మళ్లీ రిహాబిలిటేషన్ ప్రారంభించనున్నాడు. గత రెండేళ్లలో చీలమండ, నడుము నొప్పి సమస్యలతో హార్దిక్ ఆటకు దూరమయ్యాడు. 2023 వన్డే ప్రపంచకప్ మధ్యలోనే చీల మండ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. ఈ క్రమంలోనే ఫిట్‌నెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హార్దిక్ నిశ్చయించుకున్నాడు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత జింబాబ్వే సిరీస్‌తో హార్దిక్ రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించి.. బీసీసీఐ పరీక్షల్లో నెగ్గితేనే భారత జట్టులోకి వస్తాడు. బెంగళూరుకు మకాం మార్చిన హార్దిక్ పూర్తిగా ఫిట్ అవుతాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# వివాదంలో చిక్కుకున్న శశాంక్ సింగ్

తమ ఇంట్లో పనిచేసే వంట మనిషిపై భౌతిక దాడికి పాల్పడటం, అసభ్య పదజాలంతో దూషించడం, బలవంతంగా గదిలో బంధించారనే ఆరోపణలపై భోపాల్ పోలీసులు వీరిపై శనివారం (జూన్ 29, 2026) క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో వీరి కుటుంబ డ్రైవర్ మిశ్రాను కూడా సహ నిందితుడిగా చేర్చారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రాతీబడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ ఘోర ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లాకు చెందిన విపేంద్ర సింగ్ తోమర్ (31) అనే వ్యక్తి పరిచయస్తుల ద్వారా జూన్ 25న భోపాల్‌లోని మెందోరి గ్రామంలో ఉన్న ఈ మాజీ ఐపీఎస్ అధికారి బంగ్లాలో వంట మనిషిగా చేరాడు. నెలకు రూ.15,000 జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం ఇస్తామని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా సహాయం చేస్తామని నమ్మించి అతడిని పనిలో పెట్టుకున్నారు.బాధితుడు విపేంద్ర సింగ్ తోమర్ పోలీసులకు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ప్రకారం..



తాను పనిలో చేరిన కొన్ని గంటల్లోనే వండిన ఆహారం నాణ్యత, రుచి బాలేదంటూ శశాంక్ సింగ్ కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారు. బూతు పురాణంతో వేధించడం ప్రారంభించారు. ఇంట్లోని ఘోరమైన వాతావరణాన్ని చూసి తాను ఉద్యోగం వదిలేసి సొంతూరికి వెళ్ళిపోతానని చెప్పడంతో నిందితులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. బాధితుడు బయటి వ్యక్తులకు సమాచారం అందించకుండా ఉండేందుకు అతని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. వారి నుంచి తనను తాను రక్షించుకోవడానికి విపేంద్ర ఒక గదిలోకి వెళ్లి తలుపు వేసుకోగా.. క్రికెటర్ శశాంక్ సింగ్, ఆయన ఐపీఎస్ తండ్రి మరియు డ్రైవర్ కలిసి గది తలుపులు బద్దలుకొట్టి లోపలికి దూసుకెళ్లారు. విపేంద్రపై తీవ్రంగా భౌతిక దాడి (బేగరితనం) చేసి, గాయపరిచి బంగ్లా నుండి బయటకు గెంటివేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు అతనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విపేంద్ర ముఖం, శరీరంపై స్పష్టమైన గాయాల గుర్తులు ఉన్నట్లు వైద్య నివేదికలో నిర్ధారణ అయింది. ఒకవైపు ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత పంజాబ్ కింగ్స్ ఫినిషర్‌గా శశాంక్ సింగ్ ప్రదర్శనలపై విమర్శలు వస్తున్న తరుణంలో, మైదానం బయట ఇలాంటి సీరియస్ క్రిమినల్ కేసు నమోదు కావడం క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై భోపాల్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్ క్రికెట్ జట్టు మెంటార్‌గా వసీం జాఫర్

హైదరాబాద్ క్రికెట్ జట్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (ఎజూ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీ క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్‌ను రాబోయే రెండేళ్ల కాలానికి జట్టు మెంటార్‌గా నియమించింది. ఇటీవల 'హెడ్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్'గా బాధ్యతలు చేపట్టిన అంబటి రాయుడు ప్రోద్భలంతోనే జాఫర్ ఈ పదవికి ఎంపికైనట్లు తెలుస్తోంది. రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఉన్న 48 ఏళ్ల జాఫర్ రాకతో హైదరాబాద్ టీమ్‌కు కొత్త బూస్ట్ రానుంది.టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్ , హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మెంటార్‌గా నియమితులయ్యాడు. భారత దేశవాళీ క్రికెట్‌లో 'రెడ్ బాల్' (ఫస్ట్-క్లాస్) ఫార్మాట్‌లో దిగ్గజంగా పేరుసంపాదించిన జాఫర్.. వచ్చే రెండేళ్ల పాటు హైదరాబాద్ జట్టుకు మార్గనిర్దేశం చేయనున్నాడు. ఇటీవలే అంబటి రాయుడును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ 'హెడ్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్'గా నియమించింది. తాజాగా అనుభవజ్ఞుడైన జాఫర్‌ను మెంటర్‌గా తీసుకుంది. అయితే.. రాయుడు ప్రోద్భలంతోనే జాఫర్‌ను ఈ పదవికి ఎంపిక చేసినట్టు సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించాడు వసీం జాఫర్. 1996 నుంచి 2020




వరకు సాగిన తన అద్భుతమైన 24 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అతడు అధిగమించాడు. 260 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 50.67 సగటుతో 19,410 పరుగులు సాధించాడు. ఇందులో 57 సెంచరీలు, 91 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అలాగే, రంజీ ట్రోఫీ చరిత్రలో 238 ఇన్నింగ్స్‌లలో 12,038 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన రికార్డును కూడా జాఫర్ తన పేరిట లిఖించుకున్నాడు. ఇక 48 ఏళ్ల జాఫర్ భారత్ తరఫున 31 టెస్టులు ఆడాడు. ఇందులో 5 సెంచరీలు, 11 హాఫ్ సెంచరీలు సహా.. 1,944 పరుగులు ఉన్నాయి. జాఫర్‌కు కోచింగ్‌లో అనుభవం ఉంది. అతడు పంజాబ్, ఉత్తరాఖండ్, ఒడిశా జట్లకు ప్రధాన కోచ్‌గా పనిచేశాడు. గత సీజన్‌లో విదర్భ జట్టుకు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా సేవలందించాడు. అంతేకాకుండా బంగ్లాదేశ్ అండర్-19 జట్టుకు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా కూడా పనిచేశాడు. 2019-23 వరకు ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు. రెండుసార్లు (1937-38, 1986-87) రంజీ ట్రోఫీ ఛాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టు ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో తన ప్రాభవాన్ని కోల్పోయింది. 2025-26 రంజీ ట్రోఫీలో హైదరాబాద్.. ఎలైట్ గ్రూప్-డిలో నాలుగో స్థానంలో నిలిచింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 పోటీలో, ఎలైట్ గ్రూప్ బిలో అగ్రస్థానంలో నిలిచింది. కానీ సూపర్ లీగ్ గ్రూప్-బిలో రెండో స్థానం నిలిచి, ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. విజయ్ హజారే ట్రోఫీలో, హైదరాబాద్.. గ్రూప్-బిలో ఆరో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయింది.



# పరాగ్వే చేతిలో జర్మనీ ఓటమి

### - జర్మనీ టోర్నీ నుంచి అవుట్

ఫిఫా వరల్డ్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్ లో జర్మనీ టీమ్‌కు కోలుకోలేని షాక్ తగిలింది. సోమవారం ఫాక్స్‌బరో వేదికగా జరిగిన హై-డ్రామా మ్యాచ్ లో పరాగ్వే చేతిలో పెనాల్టీ షూటౌట్ లో 3-4 తేడాతో జర్మనీ ఓడిపోయి టోర్నీ నుంచి అవుట్ అయింది. వరల్డ్ కప్ హిస్టరీలోనే జర్మనీ ఒక పెనాల్టీ షూటౌట్ లో ఓడిపోవడం ఇదే ఫస్ట్ టైమ్ కావడం గమనార్హం. అంతకుముందు నిర్ణీత సమయంలోగా ఇరు జట్లూ 1-1 తో డ్రా చేసుకున్నాయి. మ్యాచ్ ఫస్ట్ హాఫ్ లో జూలియో ఎన్సిసో పవర్‌ఫుల్ హెడర్ గోల్ తో పరాగ్వేకు ఊహించని లీడ్ ఇచ్చాడు. అయితే సెండ్ హాఫ్ 54వ నిమిషంలో జర్మనీ స్టార్ కై హావెర్ట్జ్ టోర్నీలో తన థర్డ్ గోల్ కొట్టి స్కోరును ఈక్వల్ చేశాడు. ఎక్స్‌ట్రా టైమ్‌లో జర్మనీ ప్లేయర్ జోనాథన్ తా కొట్టిన గోల్ ను వీఏఆర్ రివ్యూ ద్వారా అంపైర్ రద్దు చేశాడు. దీంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్ కు దారితీసింది. ఈ నెర్వ్-జాంగ్లింగ్ షూటౌట్ లో పరాగ్వే గోల్ కీపర్ ఒర్లాండో గిల్ అద్భుతమైన డైవ్‌లతో కై హావెర్ట్జ్, నిక్ వోల్టెమేడ్‌ల షాట్లను బ్లాక్ చేసి హీరోగా నిలిచాడు. పరాగ్వే ప్లేయర్లు రెండు విన్నింగ్ ఛాన్సెస్ మిస్ చేసుకున్నప్పటికీ, జర్మనీ డిఫెండర్ జోనాథన్ తా కొట్టిన లాస్ట్ షాట్ బార్ పై నుంచి బయటకు వెళ్ళిపోయింది. కరెక్ట్ టైమ్ లో వచ్చిన ఛాన్స్ ను పరాగ్వే ప్లేయర్ జోస్ కెనాల్ గోల్ గా మార్చి జర్మనీని టోర్నీ నుంచి పంపించేశాడు. 2014 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఫస్ట్ టైమ్ నాకౌట్ చేరిన జర్మనీకి ఇది ఊహించని పెద్ద పరాభవం. మరొక క్రేజీ మ్యాచ్ లో మొరాకో టీమ్ కూడా పెనాల్టీ షూటౌట్ లో నెదర్లాండ్స్ ను దెబ్బకొట్టి లాస్ట్ 16 లోకి దూసుకెళ్లింది. మాంటెర్రే వేదికగా జరిగిన ఈ మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్ ముగిసేసరికి 1-1 తో టై అయింది. డచ్ టీమ్ మ్యాచ్ సెండ్ హాఫ్ లో కోడి గ్యాక్పో కొట్టిన సూపర్ గోల్ తో విక్టరీకి చాలా క్లోజ్ గా వచ్చింది. తన పుట్టబోయే కొడుకు చనిపోయాడని పార్ట్‌నర్ కన్ఫర్మ్ చేసిన కొన్ని రోజుల్లోనే గ్యాక్పో ఈ ఎమోషనల్ గోల్ కొట్టడం అందరినీ కదిలించింది. అయితే మ్యాచ్ స్టాపేజ్ టైమ్ ఫస్ట్ నిమిషంలో మొరాకో ప్లేయర్ ఇస్సా డియోప్ ఒక డ్రామాటిక్ హెడర్ గోల్ కొట్టి నెదర్లాండ్స్ విక్టరీ ఆశలను దెబ్బకొట్టాడు. షూటౌట్ లో మొరాకో గోల్ కీపర్ యాసిన్ బౌనో కీ రోల్ ప్లే చేశాడు. నెదర్లాండ్స్ తరఫున ఫిఫ్త్ పెనాల్టీ కొట్టిన క్రిసెన్సియో సమ్మర్‌విల్లే షాట్ ను బౌనో అద్భుతంగా బ్లాక్ చేశాడు. ఆ వెంటనే మొరాకో స్ట్రైకర్ ఇస్మాయిల్ సైబారీ పవర్‌ఫుల్ విన్నింగ్ స్పాట్-కిక్ తో గోల్ కొట్టి షూటౌట్ లో 3-2 తో నెదర్లాండ్స్ కథ ముగించాడు. ఈ సంచలన విజయంతో మొరాకో టీమ్ శనివారం హ్యూస్టన్ వేదికగా జరగబోయే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ లో కెనడాతో తలపడనుంది. ప్రెజర్ సిట్యుయేషన్స్ లో నెదర్లాండ్స్ ఫెయిల్ అయిందని, మొరాకో కీపర్ బౌనో వరల్డ్ క్లాస్ పర్ఫార్మెన్స్ తో మ్యాచ్ ను చేంజ్ చేశాడు.



# ఇంగ్లండ్‌తో తొలి రెండు టీ20లకు వైభవ్ వద్దు

### - భారత మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్

ఐర్లాండ్ చేతిలో చిత్తుగా ఓడిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. బుధవారం నాటింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది.ఈ కీలక సిరీస్ గురించి భారత మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడాడు. తొలి రెండు టీ20ల కోసం భారత తుది జట్టును అంచనా వేసాడు. అయితే ఈ జట్టులో టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి శ్రీకాంత్ చోటు కల్పించలేదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లను ఎంపిక చేశారు. వైభవ్‌ను పక్కన పెట్టడంపై శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లోనే వైభవ్ సూర్యవంశీ 100 శాతం ఆడాల్సింది. తొలి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసిన అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చి.. వైభవ్‌కు అవకాశం ఇవ్వాల్సింది. ఐపీఎల్‌లో కష్టమైన పరిస్థితుల్లో రాణించిన వైభవ్, బహుశా ఆ మ్యాచ్ గెలిపించే వాడేమో. కానీ అక్కడ అవకాశం ఇవ్వనందున, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరిగే తొలి రెండు టీ20ల్లో అతన్ని నేరుగా తుది జట్టులోకి తీసుకోలేం'అని స్పష్టం చేశారు. ఇటీవల ముగిసిన ఐర్లాండ్ సిరీస్‌లో భారత ఓపెనర్లు ఘోరంగా విఫలమయ్యారు. తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 49 పరుగులు చేయగా.. సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. ఇక రెండో టీ20లో ఇద్దరూ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగారు. తొలి మ్యాచ్‌లో 183 పరుగుల లక్ష్య ఛేదనలో 34 పరుగుల తేడాతో ఓడిన భారత్, రెండో మ్యాచ్‌లో కేవలం ఒక పరుగు తేడాతో పరాజయం పాలైంది. ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇదే తొలి సిరీస్ ఓటమి.

# మెదక్‌పై ఘనవిజయం సాధించిన కరీంనగర్




టీజీ20 లీగ్‌లో భాగంగా మంగళవారం మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ 133 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. రాదేశ్ సెంచరీతో చెలరేగడంతో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ భారీ స్కోరు సాధించగా, ఆ తర్వాత ఆ జట్టు బౌలర్లు సమిష్టిగా రాణించి మెదక్ ఫాల్కన్స్‌ను తక్కువ స్కోరుకే కుప్పకూల్చారు. మెదక్ ఫాల్కన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 232 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ సాత్విక్ రెడ్డి (35; 18 బంతుల్లో 2 సిక్సర్లు, 4 ఫోర్లు) వేగంగా తమ జట్టుకు మంచి పునాది వేశాడు. అయితే తన్మయ్ అగర్వాల్ (11), రావురి శరణ్ (11) తక్కువ స్కోరుకే అవుట్ కావడంతో కరీంనగర్ జట్టు 58 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే నాలుగో డౌన్‌లో వచ్చిన రాహుల్ రాదేశ్ (101; 48 బంతుల్లో 8 సిక్సర్లు, 8 ఫోర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మెదక్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. కేవలం 30 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తి చేసుకున్న రాదేశ్, ఆ తర్వాత మరింతగా చెలరేగిపోయాడు. కేవలం మరో 16 బంతుల్లోనే సెంచరీ మార్కును దాటేశాడు. మరోవైపు చందన్ సహాని (56; 36 బంతుల్లో 3 సిక్సర్లు, 5 ఫోర్లు) అర్ధ శతకంతో రాదేశ్‌కు చక్కని సహకారం అందించాడు. రాదేశ్-చందన్ జోడీ నాల్గో వికెట్‌కు ఏకంగా 163 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి తమ జట్టును పటిష్ట స్థితికి చేర్చింది. ముఖ్యంగా ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో వీరిద్దరూ భారీగా పరుగులు రాబట్టారు. అశ్విన్ రామ్ వేసిన 15వ ఓవర్లో రాదేశ్ నాలుగు సిక్సర్లు బాదాడు. ఈ ఓవర్‌లో ఏకంగా 35 పరుగులు రావడం గమనార్హం. రవితేజ, కార్తికేయ బౌలింగ్‌లోనూ వీరిద్దరూ పరుగుల వరద పారించారు. సాయివరుణ్ వేసిన 19వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన రాదేశ్ తన సెంచరీ పూర్తి చేశాడు. కరీంనగర్ జట్టు చివరి 10 ఓవర్లలోనే ఏకంగా 147 పరుగులు పిండుకోవడం గమనార్హం. ఇక మెదక్ ఫాల్కన్స్ బౌలర్లలో సాయివరుణ్, కార్తికేయ, మధుకర్, రవితేజ చెరో వికెట్ చొప్పున తీశారు. ఇక 233 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన మెదక్ ఫాల్కన్స్ జట్టు కరీంనగర్ బౌలర్ల ధాటికి చేతులెత్తేసింది. ఓపెనర్ ఇషాన్ శర్మ (0) మొదటి ఓవర్ ఐదో బంతికే హరీశ్ ఠాకూర్ చేతిలో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ఏ ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. కరీంనగర్ బౌలర్లు కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో వరుస వికెట్లు పడగొట్టడంతో, మెదక్ ఫాల్కన్స్ జట్టు 18 ఓవర్లలో కేవలం 99 పరుగులకే ఆలౌట్ అయింది. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ 2, శుభమ్ శర్మ 2, సాత్విక్ రెడ్డి 1, సతీశ్ కుమార్ 1, నారాయణ తేజ 1, అఖిల్ 1, హరీశ్ ఠాకూర్ 1 వికెట్ చొప్పున పడగొట్టారు. కాగా, ఇప్పటి వరకు ఈ లీగ్‌లో ఐదు మ్యాచులు ఆడిన ఈ టీమ్‌కు ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. మరో వైపు తాజా భారీ విజయంతో టీజీ 20 లీగ్‌లో కరీంనగర్ డైమండ్స్ తమ నెట్ రన్ రేట్‌ను భారీగా మెరుగుపరుచుకుని పాయింట్ల పట్టికలో ముందు దూసుకుపోయింది.

# ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబో..

## సుబ్రమణ్యస్వామిపై నాగవంశీ వ్యాఖ్యలపై దుమారం

ద





యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ప్రకటించిన సరికొత్త మైథలాజికల్ చిత్రం అప్పుడే సోషల్ మీడియాలో ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ భారీ అంచనాలను పెంచినప్పటికీ, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక క్యాప్షన్ తమిళ నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మురుగన్‌ను ఉద్దేశించి ఆయన ఉత్తరాదిన జన్మించి, హృదయభూమిలో రూపుదిద్దుకుని, దక్షిణాదిన పూజలందుకుంటున్నాడు అని పోస్ట్ చేయడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. తమిళ సంస్కృతి, ప్రాచీన సంగం సాహిత్యం ప్రకారం మురుగన్‌ను తమిళుల దేవుడు అని పిలుస్తారు కాబట్టి, ఆయనను ఉత్తరాదిన జన్మించాడని అనడంపై తమిళ సినీ ప్రియులు తీవ్రంగా మండిపడుతున్నారు. అంతేకాకుండా, అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తమిళానికి బదులు సంస్కృత శ్లోకాన్ని ఉపయోగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ఎక్స్ లో ట్రోల్స్ చేస్తున్నారు. అయితే మరోవైపు, పురాణాల ప్రకారం శివపార్వతుల కుమారుడైన కార్తికేయుడు హిమాలయాల్లో జన్మించాడని, దేవుడిని ఒక ప్రాంతానికే పరిమితం చేయలేమని మరికొందరు నెటిజన్లు నాగవంశీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఈ సున్నితమైన భక్తిరస సబ్జెక్ట్‌ను సాంస్కృతిక విలువలకు భంగం కలగకుండా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించాలని పలువురు మేకర్స్‌ను కోరుతుండగా, కేవలం ఒక్క పోస్టర్‌ను చూసి సినిమాను జడ్జ్ చేయవద్దని ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్ర వివాదంపై హారిక అండ్ హాసిని క్రియేషన్స్ టీమ్ ఇంకా ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వనప్పటికీ, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న క్రేజ్ మరియు అంచనాలు మాత్రం దేశవ్యాప్తంగా రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి.

# అల్లరి నరేశ్..మళ్లీ కామెడీ ట్రాక్

## కొత్త మూవీ రంభ ఊర్వశి మేనక ఫస్ట్ లుక్ విడుదల

కామెడీ కింగ్ అల్లరి నరేష్ మంగళవారం తన పుట్టినరోజును జరుపుకున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ఫస్ట్




లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బ్రహ్మ కదలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది

## నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి

నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.



# అజయ్ దేవగణ్ చౌహాన్ టీజర్

## చిత్రంలో సంభాషణలపై క్షత్రియుల అభ్యంతరం



బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు నీరజ్ యాదవ్ తెరకెక్కిస్తున్న 'చౌహాన్' సినిమా టీజర్ విడుదలైన కొన్ని రోజుల్లోనే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాపై క్షత్రియ పరిషత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ముఖ్యంగా ఈ చిత్ర టీజర్‌లో అజయ్ దేవ్‌గణ్ పలికిన 'పఠానులకు చెప్పండి, చౌహాన్ వస్తున్నాడు' అనే వివాదాస్పద డైలాగ్ సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్ని రేపుతోంది. కాశ్మీర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పెల్లెట్ గన్‌ల వాడకంపై ఉన్న సంభాషణలు, మతపరమైన అంశాలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని నెటిజన్లతో పాటు నటి స్వరా భాస్కర్ వంటి పలువురు ప్రముఖులు సైతం ఇప్పటికే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తాజాగా క్షత్రియ పరిషత్ ఈ చిత్రంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేయడం సినిమా పరిశ్రమలో మరియు రాజకీయ వర్గాలలో తీవ్ర సంచలనంగా మారింది. క్షత్రియ పరిషత్ తమ ప్రకటనలో ఈ చిత్రాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రస్తుత సమాజంలో స్వార్థపూరిత రాజకీయ లబ్ధి కోసం, ఓట్ల వేట కోసం చౌహాన్ వంశం పేరును మరియు రాజ్‌పుత్ సమాజ అస్తిత్వాన్ని వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడింది. రాజ్‌పుత్ చరిత్ర అనేది ఎన్నికల ప్రచారాలకు లేదా బాధ్యతారహితమైన మీడియా సంచలనాలకు వాడుకునే రాజకీయ వస్తువు కాదని వారు స్పష్టం చేశారు. చిత్ర నిర్మాతలు కేవలం వివాదాలు సృష్టించి లాభపడాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌పుత్ వారసత్వాన్ని వివాదాలకు ఎరగా వేయకూడదని డిమాండ్ చేశారు. అయితే ఈ మొత్తం వివాదంపై మరియు క్షత్రియ పరిషత్ లేఖపై చౌహాన్ చిత్ర యూనిట్ కానీ, హీరో అజయ్ దేవ్‌గణ్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

# టాక్సిక్ ఓ అద్భుతమైన అనుభం

## నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు



'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు. ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియార, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

------

# సమంత ప్రెగ్నెంట్ అని తెలిసాక జాగ్రత్త పడ్డాం

## మా ఇంటి బంగారం షూటింగ్‌పై నందినిరెడ్డి వెల్లడి



అగ్ర కథానాయిక సమంత తల్లి కానున్న విషయం తెలిసాక..మా ఇంటి బంగారం' షూట్‌లో ఆమె కోసం చాలా జాగ్రత్తలు తీసుకున్నామని దర్శకురాలు నందినిరెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఈ సినిమా షూటింగ్ సమయంలో సమంత ఈ గుడ్‌న్యూస్ తనకు చెప్పారని.. ఎవరికీ చెప్పొద్దన్నారని

9 గంటలకు షూట్ ప్రారంభమవుతుందంటే సమంత కచ్చితంగా ఆ సమయానికి సెట్‌లో ఉంటారు. ఈ చిత్రంలో తస్సాదియా సాంగ్ షూటింగ్ అప్పుడు సమంతకు జ్వరం వచ్చిందని 11.30కు వస్తారని అన్నారు. నాకేమో టెన్షన్.. మొదట ఈ పాట 4 రోజులు చేయాలని అనుకున్నాం. షెడ్యూల్ కారణంగా రెండు రోజులకు కుదించాల్సి వచ్చింది. ఒకవైపు సామ్ హెల్త్ బాలేదు.. ఎలా పూర్తవుతుందా అని టెన్షన్ పడ్డాను. చెప్పినట్లే 11.30కు వచ్చి షూట్ కంప్లీట్ కాగానే వెళ్లిపోయింది. మళ్లీ రెండోరోజు రాగానే జ్వరం తగ్గిందా.. ఎందుకు అలా తరచూ వస్తోంది అని అడిగాను. 'జ్వరం కాదు.. నేను ప్రెగ్నెంట్‌ని. ఈ విషయం ఎవరికీ చెప్పకు' అని సమంత చెప్పింది. నాకు చాలా ఆనందం వేసిందని నందినిరెడ్డి అన్నారు. సమంత నాకు ఆ మాట చెప్పగానే డ్యాన్స్ మాస్టర్ దగ్గరకు వెళ్లి ఆమెకు ఆరోగ్యం బాలేదు. తనతో ఎక్కువ రిహార్సల్స్ చేయించొద్దు అని చెప్పాను. చిన్నచిన్న స్టెప్స్‌తో కంటిన్యూ చేద్దామని చెప్పా. సమంత మార్నింగ్ సిక్‌నెస్‌తోనే ఆ పాట పూర్తి చేసింది. కార్ యాక్సిడెంట్ సీన్, ఛేజింగ్ సన్నివేశం కూడా తర్వాత షూట్ చేసినవే. చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. 3.30 తర్వాత నీడలో షూట్ చేశాం. ఆమె ఎక్కువ ఒత్తిడికి గురికాకుండా చూసుకున్నాం అని నందినిరెడ్డి చెప్పారు. సమంతను బెస్ట్‌గా చూపించాలనే ఏకైక ఉద్దేశంతోనే ఈ చిత్ర బృందమంతా వర్క్ చేసినట్లు తెలిపారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.